ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

కల్లూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. పులిచెర్ల, రొంపిచర్ల మండలాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్, డిఆర్ఓ మోహన్ కుమార్, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డ్వామా పిడి రవికుమార్, డిఆర్డి ఎపిడి శ్రీదేవి, ఆర్డీవో శ్రీనివాసులు, పుంగనూరు ఆర్టిఓ సుప్రియ, తాసిల్దారులు జయసింహ, అమర్నాథ్, ఎంపీడీవోలు రాజశేఖర్ బాబు, మధుసూదన్ రెడ్డి, డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

"సారధ్యం"తో ఉనికి చాటుకోగలరా!?

తిరుపతి జిల్లాలో బిజెపి బలోపేతానికి వ్యూహం ఫలిస్తుందా!!

ప్రభాతవార్త-తిరుపతి:

రాష్ట్రంలో టిడిపి కూటమిలో భాగస్వామ్యమైన బిజెపి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకునే దిశగా వేస్తున్న అడుగులు సత్ఫలితాలనిస్తుందా అనేది ఇప్పుడు జనంలో చర్చనీయాంశంగా మారింది. ఏకంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసిన తరువాత బిజెపికి చెందిన మంత్రులు కూడా ప్రభుత్వంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో మరీ ప్రధానంగా రాయలసీమజిల్లాల్లో పార్టీ ఉనికి చాటుకోవడానికి రాష్ట్ర పార్టీ చీఫ్ పివిఎన్ మాధవ్ చేపట్టిన సారథ్యం పర్యటన, ఆయా నియోజకవర్గాల్లో సభలు ఎంతవరకు సానుకూల ఫలితాలనిస్తుందనేది ఆ పార్టీలోనే సందిగ్ధత నెలకొంది. ఇందుకు నిదర్శనంగా రాష్ట్రంలో బిజెపి పగ్గాలను నూతనంగా పివిఎన్ మాధవ్‌కు పార్టీ అధిష్టానం అప్పగించింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మద్దతుతో ఆయన నేతృత్వంలో రాష్ట్రంలో పార్టీని మరింతగా బలోపేతంచేయడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయానేది ప్రశ్నగానే మిగిలింది. ఇదే సమయంలో తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన సామంచి శ్రీనివాస్ వృత్తిరీత్యా న్యాయవాది కావడం, పార్టీలో క్రిందిస్థాయి నుండి పదవుల్లో ఎదిగిన నాయకుడుగా

ముద్ర వేసుకున్నారు. పార్టీలో అందరినీ కలుపుకుని పనిచేసే వ్యక్తిత్వం ఉన్న ఆయన ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పర్యటించి అన్ని నియోజకవర్గాల్లో స్థానికంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశాలు కూడా నిర్వహించారు. సభ్యత్వనమోదు కూడా ఒక యజ్ఞంలా తీసుకున్నారు. స్వయంగా ఆయన అన్ని మండలాల్లో, నియోజకవర్గాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని వారికి తనవంతు మద్దతుగా నిలుస్తున్నారు. ఇదే సమయంలో రాష్ట్రఛీఫ్ మాధవ్ పార్టీలో కార్యకర్తలను ప్రజాప్రతినిధిగా తయారు చేయాలనే ఆశయంతో వేస్తున్న సారథ్యం అడుగులు మాత్రం రానున్న రోజుల్లో ఎంతవరకు సానుకూలంగా మలచుకుంటారనేది కూడా పార్టీలో కీలకం. గత నాలుగుదశాబ్దల కాలంలో రాయలసీమ జిల్లాల్లో ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరుజిల్లాలో బిజెపి పరిస్థితి పరిశీలిస్తే మదనపల్లికి చెందిన చల్లపల్లి నరసింహారెడ్డి తంబళ్ళపల్లి నియోజకవర్గంలో కొంతకాలం కీలకపాత్ర వహించారు. ఆతరువాత ప్రజల్లో కూడా బిజెపిపట్ల పెద్దగా ప్రాధాన్యతివ్వలేకపోయారు. 2009లో తిరుపతి నియోజకవర్గం నుండి ప్రస్తుత రాష్ట్రఅధికారప్రతినిధి, టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిచవిచూశారు. ఓటర్లు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వలేదనేది పార్టీలో చర్చ. గత 16సంవత్సరాలలో ఉమ్మడిచిత్తూరుజిల్లాలో బిజెపి అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించిన సందర్భం లేదు. దాదాపు 18లక్షలమంది వరకు ఉన్న ఓటర్లులో తిరుపతి నియోజకవర్గంలోనే 3లక్షలవరకు ఓటర్లు ఉన్నారు. మరీ ఓటుబ్యాంకును ఉనికిచాటుకునే దిశగా బిజెపి నాయకులు ప్రజల మనస్సును ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తారా అనేది వేచిచూడాల్సిందే.

అందాల జలపాతాలు



కొండల్లోంచి ప్రవహిస్తున్న పాలధారలు ముగ్ధులౌతున్న భక్తులు

తిరుమల, ఆగస్ట్ 11 ప్రభాతవార్తప్రతినిధి:

అల్పపీడనం ప్రభావంతో గత ఐదు రోజులుగా కురుస్తున్న జోరు వానలకు శేషాచలం కొండల్లోంచి జలపాతాలు ప్రవహిస్తున్నాయి. ఏడు కొండల్లోంచి అవ్వాచారికోన మీదుగా ఔషధమూలికలు కలసిన వాన నీరు మాల్వాడిగుండం మీదుగా ప్రవహిస్తుండటంతో కొత్తశోభనుసంతరించుకుంది. తిరుమల శేషాచలం అటవీప్రాంతంలో జలపాతాలు పాలధారల్లా తెల్లనినురుగుతో కనువిందుచేస్తున్నాయి. కొండల్లో కురిసిన వానతో తిరుపతికి దిగే మొదటిఘాట్‌లో మాల్వాడిగుండం జలపాతం ప్రవహిస్తోంది. కపిలతీర్థం జలపాతం భక్తులను ఆకట్టుకుంటోంది.

ప్రధానికి శ్రీవారి ప్రతిమను అందించిన ఎంపి దగ్గుమళ్ళ

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:

ప్రధాని నరేంద్రమోడికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు సోమవారం శ్రీవారి ప్రతిమను అందజేశారు. న్యూఢిల్లీలోని పార్లమెంటు హౌస్‌లో సోమవారం ప్రధాని నరేంద్రమోడిని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో ఎపి రాష్ట్ర కూటమి ఎంపీల బృందం మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎంపీల బృందం రాష్ట్రానికి అత్యధిక నిధులు కేటాయించి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతున్న ప్రధాని మోడికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీల బృందం ఆపరేషన్ సింధూర్ ఘన విజయంపై ప్రధాని మోడికి అభినందనలు తెలిపారు.

స్మార్ట్ మీటర్లను ధ్వంసం : ఎడి కార్యాలయం వద్ద ధర్నా

శ్రీకాళహస్తి, ఆగస్టు 11 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని వామ పక్షాల సారధ్యంలో సోమవారం విద్యుత్ శాఖ రూరల్ ఏడి కార్యలయం ఎదుట స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా చేసారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్లను పగుల గొట్టి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్షాల పార్టీల నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్టుకున్న వినియోగదారుని జేబులకు చిల్లులు పెడుతున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటరు ధర రూ.9వేలు అని దానిని వినియోగదారుడే చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. దీనిని కూడా దశల వారిగా బిల్లుల్లో కలుపుతారని వివరించారు. అలాగే వినియోగదారుల లు కరెంటు కావాలంటే ముందుగా మొబైల్ రీచార్జి చేసినట్లు చేసకుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ ఒప్పందాలను వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో విద్యుత్ ఉద్యమం తప్పదన్నారు. ఈకార్యక్రమాల్లో సిపిఐ నాయకులు జనమాల గురవయ్య, రోడ్ల గోపి, మించల శివకుమార్, శ్రీనివాసులు, చారులత, మునిరాజా, జనార్ధన్, మురళి, సిపిఎం పార్టీ నాయకులు ఆంగేరి పుల్లయ్య, గంధం మణి, గురవయ్య, రాపూర్, సుబ్రమణ్యం, మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అలాగే ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో సిఐటియు రైతు సంఘం ఆధ్వర్యంలో స్మాట్‌మీటర్ల వ్యతిరేకంగా ఎఇ కార్యాలయం వద్ద మండల కార్యదర్శి కరీముల్లా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రైతు సంఘ కార్యదర్శి రంగయ్య, రాంబాబు, వెంకటాద్రి, గిరి, మస్తాన్, రుద్రయ్యలు పాల్గొన్నారు.

నిరుపేదలకు, దళితులకు సిపిఐ అండ

నక్కలకాలువఖండ్రిగ భూములను సాగుచేసుకుంటున్న నిరుపేద దళితులకు పంపిణీ చేయాలి
- భూములను పరిశీలించిన సిపిఐ జాతీయ కార్యదర్శి కే. నారాయణ

చిల్లకూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త

గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండల పరిదిలోని నెలబల్లిరెట్టపల్లి గ్రామ పంచాయతీ, నక్కలకాలువ ఖండ్రిగలో గత 22 సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న భూములను, నెలబల్లి రెట్టపల్లి గ్రామ ఎస్ సి, ఎస్టీ వెనుకబడిన వర్గాల వారికి రెవిన్యూ అధికారులు పట్టాలు ఇవ్వాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కే. నారాయణ డిమాండ్ చేసారు. సోమవారం నక్కలకాలువఖండ్రిగ భూములను కే. నారాయణ స్థానిక నారకులతో కలసి పరిశీలించారు. నిరుపేద దళితులకు ప్రభుత్వ మిగులు భూములను ఇవ్వాలని ఖరాఖండిగా తేల్చి చెప్పారు. 2003 నుంచి ఇప్పటి దాకా పలు రకాలుగా నిర్బంధాలను పోలీసు కేసులను ఎదుర్కోంటూ ఇప్పటికీ భూములను సాగుచేసుకుంటున్న వారికి వారు సాగుచేస్తున్న అరఎకరా భూమిని వారికి ఇవ్వాలన్నారు. తిరుపతి జిల్లా వ్యవసాయ

కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నాన్ బెయిల్ కేసులు 107 సిహెచ్. ప్రభాకర్ మాట్లాడుతూ కేసులు పెట్టినప్పటికీ వాటిని ఎదుర్కొంటూ భూములను ఇప్పటికీ సాగుచేసుకుంటున్న నిరుపేద దళితులకు అండగా ఉంటున్నామని రాజీ లేని పోరాటం చేస్తున్న విషయం గుర్తు చేసారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా పంటలు పండించిన విషయం గమనించాలన్నారు. సర్వే నంబరు 1 23 వరకూ పెల్లేటి వెంకట క్రిష్ణారెడ్డి, పెల్లేటి శకుంతలమ్మ పట్టాదారులు, ప్రభుత్వం పరం చేసిన సీలింగ్ భూములని తెలిపారు. వీటిలో కొంతభాగం నకిలీ పత్రాలను స్రుష్టించి పాసు బుక్కులను పొందిఉన్నారని, వారి విషయం రెవిన్యూ అధికారులు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్ , ఎఐటియుసి నాయకులు సివిఆర్ కుమార్, నారాయణ, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, సునీల్, వ్యవసాయ కార్మిక సంఘం గూడూరు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసమూర్తి, రైతులు బాలిపాక గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..!

ఎంఎల్ఏ పులివర్తి నాని

చంద్రగిరి, ఆగస్టు 11 ప్రభాతవార్త:

రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో సోమ వారం ఆయన అగ్రికల్చర్ రీజినల్ కోడింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సుమారు రూ.కోటి ఐదు లక్షలతో నిర్మించిన కోడింగ్ సెంటర్‌లో రాయలసీమ పరిధిలోని పంటల వివరాలు, దిగుబడి అంచనాలు, వాతావరణ సమాచారం, నేల ఆరోగ్య స్థితి వంటి కీలకమైన డేటాను సేకరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, విత్తనాలు, ఎరువుల పంపిణీ వంటి కార్యక్రమాలను పర్యవేక్షిస్తుందన్నారు. గత ప్రభుత్వానికి భిన్నంగా రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాయలసీమ జోన్ మొత్తానికి సేవలందించడంలో ఈ కేంద్రం దోహదపడుతుందన్నారు. చంద్రగిరిలో కోడింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంలో సహకరించిన ముఖ్యమంత్రికి, వ్యవసాయశాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపిడిఓ వెంకటరత్నం, డిసిఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్‌భాషా, తుడా మాజీ డైరెక్టర్ ఏజి పల్లి బాల, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కర్ ధనంజయ రెడ్డి, టిడిపి మండల ఉపాధ్యక్షుడు శానంబట్ల తులసిరెడ్డి, మార్కెట్ యార్డు అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు.. భలే తుంటరి

సోమల, ఆగస్టు 11 ప్రభాతవార్త

సోమల మండలంలోని అటవీ సమీప ప్రాంతాల్లో ని పంట పొలాలపై ఒంటరి ఏనుగు తుంటరి పనులు చేస్తూ రైతులకు రాత్రి వేళల్లో నిద్ర లేకుండా చేస్తుంది. గత 25 రోజులుగా మంద నుంచి వేరుపడిన ఓ తుంటరి ఏనుగు పొలాలపై పడి పంటలను ధ్వంసం చేస్తుంది. బోన మంద, పేటూరు, కొత్తూరు, పట్రా పల్లి, రెడ్డివారి పల్లి, చిన్నకంపల్లి, గట్టువారిపల్లి, గురికివానిపల్లి తదితర గ్రామాల్లోని పంట పొలాలపై ఒంటరి ఏనుగు దాడులు చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. మామిడి అరటి చెట్లను ధ్వంసం చేయడంతో పాటు బోరు మోటర్ పైపులు డ్రిప్పు వైర్లను సైతం ధ్వంసం చేస్తుంది. నీళ్ల ట్యాంకులను పగలగొట్టడం డ్రమ్ములను ధ్వంసం చేయడం పైపులను పెరికి దూరంగా విసిరివేయడం లాంటి తుంటరి పనులు చేస్తుంది. కర్మ కాళీ ఎవరైనా మనుషులు కంటబడితే వారిపై దాడి చేసేందుకు తరుముతుంది. గ్రామ శివారులకు వచ్చి పూల తోటలను సైతం ధ్వంసం చేస్తుంది. గత 15 రోజులు క్రితం కొత్తూరుకి చెందిన రామకృష్ణంరాజు ఏనుగుల దాడిలో మృతి చెందిన ఘటన స్థానికులను చాలా కలిసి వేయడంతో రైతులు వ్యవసాయ పనులు మానుకొని ఇంటివద్దనే ఉంటున్నారు. లక్షల ఖర్చు చేసి వ్యవసాయం చేసి ఏనుగుల పాలు చేసే కన్నా వ్యవసాయం మానుకుంటే మంచిదని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి కుంకి ఏనుగులను రప్పించి ఏనుగులను పారద్రోలి రైతులను ఆదుకోవాల్సి ఉంది.

విద్యుత్ షాక్‌కు గురై యువకుడు బలి

పెళ్లకూరు ఆగస్టు 11 ప్రభాత వార్త :

పెళ్లకూరు దళితవాడకు చెందిన మెర్నూ సుధాకర్ (45) అనే వ్యక్తి సోమవారం నాడు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం మృతుడు సుధాకర్ వృత్తి రీత్యా కరెంటు పనులు చేసుకుని జీవనం సాగించేవాడు అదేవిధంగా సోమవారం నాడు కురిసిన వర్షాలతో ఇంటిలోకి కరెంటు రాకపోవడంతో కరెంటు స్తంభం దగ్గర వైర్లను చెక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు.

గణనాధుని దర్శించుకున్న రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు

కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త :

రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ మంగళవారం కానిపాకం శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్నారు. జిల్లా పర్యటన విచ్చేసిన ఆయన కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈవో కే పెంచల కిషోర్ అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు ఆయనకు వేద మండపంలో వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషావస్త్రలను చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు ప్రధాన కార్యదర్శి అట్లూరు శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కుమార్, ఐరాల మండల పార్టీ అధ్యక్షులు సునీల్ స్థానిక బిజెపి నాయకులు పరదేశి బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు

హర్ ఘర్ తిరంగా - హర్ ఘర్ స్వచ్ఛతా ర్యాలీలు

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:

దేశ స్వాతంత్ర దినోత్సవంను పుర స్కరించుకుని సోమవారం చిత్తూరు నగర పరిధిని ప్రధాన కూడళ్ళలో సోమ వారం హర్ ఘర్ తిరంగా - హర్ ఘర్ స్వచ్ఛతా ర్యాలీలు నిర్వహిం చారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ మార్గ నిర్దేశంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ ఆధ్వర్యంలో ప్రజారోగ్యం విభాగ పారిశుధ్య కార్మికులు, మేస్త్రీలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కరించుకుని స్వచ్ఛతా కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచడం కోసం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి ఒక్కరు పరిసరాల శుభ్రతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రోడ్లపై చెత్త పడవేయరాదని, గృహాల్లో వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 27 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు దేవస్థానం వద్ద ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. దేవస్థానంలో ఈనెల 27 నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా 21 రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. బ్రహోత్సవాల నిర్వహణ గడువు దగ్గర పడుతుండడంతో ఆలయ అధికారులు ఏర్పాట్లును యుద్ధప్రాతిపదిక సాగిస్తున్నారు. ఈమేరకు ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలకు రంగులు వేయడం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. అలాగే బ్రహ్మోత్సవాల ప్రచారంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ఫైవుండ్ ఆర్చిలను సిద్ధం చేస్తున్నారు. ఈఆర్చిలకు పెయింట్ వేసే పనులు యుద్ధ ప్రాదికన సాగుతున్నాయి.

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో యువకుల్ని తరలించే ముఠా

ఓ యువతి ఫిర్యాదుతో బయట పడ్డ సమస్య

ఉలిక్కిపడ్డ పోలీసులు, కేసు నమోదు

తొట్టంబేడు, ఆగస్టు 11 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి బహదూరుపేట కుందేటివారి వీధిలో నివాసముంటున్న రమేష్‌రెడ్డి, శారదమ్మల కుమారుడు ప్రవీణ్‌కుమార్ (27) రెండునెలలుగా కనబడటం లేదని ఆమె సోదరి పావని డివైయస్‌పి నరసింహామూర్తికి ఫిర్యాదు చేసారు. దాంతో మానవ అక్రమరవాణా బ్యాచ్ ఇక్కడ సంచరిస్తుందని పోలీసు అధికారి పసిగట్టారు. వెంటనే కేసు నమోదు చేయించారు. శ్రీకాళహస్తి బహదూరుపేటకు చెందిన ప్రవీణ్‌కుమార్ దుర్ వ్యసనాలకు అలవాటు పడ్డాడు. బాగా మద్యం సేవిస్తూ గంజాయికి అలవాటు పడ్డారు. ఇతనికి శ్రీకాళహస్తి, రేణిగుంటల్లో స్నేహితులున్నట్లు పావని మీడియాకు తెలిపిన వివరాలుమేరకు తెలిసింది. రెండు నెలల క్రితం ఆతను ఇంటి నుంచి వెళ్ళినట్లు వివరించారు. ఒక నెల క్రితం వరకు ఇతరుల ఫోన్లలో మాట్లాడేవారని వివరించింది. అయితే ఇదే ప్రాంతానికి చెందిన మరో యువకుడు కూడా

ప్రవీణ్‌కుమార్

కిడ్నాప్‌కు గురై వారి నుంచితప్పించుకొని వచ్చినట్లు తెలిసింది. కానీ వారు పోలీసులకు సమాచారం ఇవ్వటానికి మళ్ళీ ఏం జరుగుతుందో అని భయభ్రాంతులౌతున్నారు.

ఎలా జరిగిందంటే...

శ్రీకాళహస్తిలోని బహదూరుపేట కుందేటి వారి వీధిలో నివాసముంటున్న ప్రవీణ్‌కుమార్ రెండు నెలల క్రితం నుంచి కనబడటం లేదు. ఆతని చరవాణి నెంబర్ 91007232283 అని పావని వివరించింది. కొంత కాలంగా ఈ ఫోన్ పని చేయటం లేదని వివరించారు. నెల క్రితం కొత్త నెంబర్ నుంచి తన తమ్ముడు ఫోన్ చేసినట్లు వివరించారు. ఈ నెంబర్ 9542803020గా ఉందని వివరించారు. ఈ చరవాణి ఎక్కడుందని విచారిస్తే కాకినాడ పరిసరాల్లో ఉన్నట్లు పావని వివరించారు. కొందరు యువకుల వ్యసనాలతో ఓ బ్యాచ్ వ్యాపారం చేస్తున్నట్లు ఆమె ఫిర్యాదు చేసింది. యువకులను ఉపాధి అవకాశాలు నెలకు రూ.15 నుంచి 18 వందల వరకు జీతం వస్తుందని ఆశ చూపి వారిని తీసుకెళుతున్నారని పావని వివరించింది. ఇక్కడ నుంచి తీసుకెళ్ళి యువకులకు బాగా మద్యం అందించి కళ్ళకు గంతలకట్టి కొత్త ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తప్పించుకున్న వ్యక్తి వివరించారని పావని వివరించారు. ఈ సమస్యకు సంబంధించి తన తమ్ముడు కనిపించటం లేదనే సమస్యను టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయటానికి ంరెండు సార్లు వెళితే అక్కడ పని చేసే సిబ్బంది తమకేమి పని లేదా? మీరెళ్ళి వెతుక్కోండని వెనక్కు పంపినట్లు పావని వివరించారు. ఈ సమస్యనే పావని డివైయస్‌పి నరసింహామూర్తికి వివరించారు.

డివైయస్‌పి వివరణ:

పావని ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి డివైయస్‌పి నరసింహామూర్తిని వివరణ కోగా పావని తనకు పిర్యాదు చేసినట్లు వివరించారు. అంతేకాక కాకుండా తన కార్యాలయానికి వచ్చి వివరాలు అందించినట్లు కూడా వివరణ ఇచ్చారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయించామని అలాంటి ముఠా ఉంటే పట్టుకుంటామని ప్రవీణ్ కుమార్ ఆచూకి సంబంధించి ప్రత్యేక దళాలను నియమిస్తామని వివరణ ఇచ్చారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పలమనేరు, ఆగస్టు 11, ప్రభాతవార్త:

బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో శంకర నేత్రాలయ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 40 మందికి వైద్య పరీక్షలు చేయగా 23 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి చెన్నై శంరనేత్రాలయ ఆసుపత్రిలో ఉచిత కంటి ఆపరేషన్లు చేస్తారు. గతంలో కంటి శస్త్ర చికిత్సలు చేసుకున్న వారికి మహతి ట్రస్ట్ అధ్యక్షుడు నాగరాజు కంటి అద్దాలు పంపిణీ చేశారు.

రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటున్న తాసిల్దార్

పూతలపట్టు, ఆగస్టు 11, ప్రభాతవార్త

పూతలపట్టు మండలం తహసిల్దార్ రమేష్ బాబు గతంలో మూలపడి పెండింగ్‌లో ఉన్న పాత కొత్త రికార్డులను కొన్ని సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను రికార్డులను తను స్టడీ చేసి రైతులకు సామాన్య ప్రజలకు న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పూతలపట్టు మండలంలో పురుషోత్తం నాయుడు తాసిల్దార్‌తో మాట్లాడుతూ గతంలో నలుగురు ఎమ్మార్వోలు నా సమస్యను వాళ్ళ దగ్గరికి తీసుకువెళ్లిన పరిష్కారానికి నోచుకోని సమస్యను తను ఓపికగా విని మా భూమి రికార్డులను పరిష్కారం మార్గంలో చూపుతూ న్యాయం చేయడమే కాకుండా తేనెపల్లి పంచాయతీలో రోడ్డు సమస్య తాసిల్దార్ దృష్టికి రాగానే ఆర్ఐను పిలిపించి వారం రోజుల లోపు ఈ సమస్యను పరిష్కారం మార్గం చూపాలని తెలిపారు. ఇరు వర్గాల వాదనలు విని వారు ఒప్పుకోకుండా పోవడం వలన రెండు వర్గాల వారికి నోటీసులు పంపించి రికార్డుల భూమిని పరిశీలించి పరిష్కార మార్గం చూపిస్తున్నారు. ఇలాంటి తాసిల్దార్ తమ మండలానికి రావడం మండల ప్రజలు చేసుకున్న అదృష్టమని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో మొబైల్ యజమానిపై పోలీసులకు ఫిర్యాదు

పలమనేరు, ఆగస్టు 11, ప్రభాతవార్త:

పలమనేరులో రంగబాబు సర్కిల్ సమీపంలో ఓ ఆటో మొబైల్స్ యజమానిపై సోమవారం మెకానిక్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆటో మొబైల్స్ వద్ద ఇతర మెకానిక్‌లు నామమాత్రపు చార్జీలు వసూలు చేస్తున్నారు. దీంతో ఆటో మొబైల్స్ యజమాని తమ వద్ద పనిచేసే వారి వద్దే రిపేర్లు చేసుకోవాలని మెకానిక్‌లను బెదిరించేవాడు. దీనిపై మెకానిక్‌ల సంఘం యూనియన్ నాయకులు ఆటో మొబైల్ యజమానితో చర్చలు జరిపి ఆటో మొబైల్స్‌లో స్పేర్ పార్టులు మాత్రమే కొనుగోలు చేయాలని రిపేర్లతో సంబంధం లేదని అంగీకారానికి వచ్చారు. ఐతే ఈ విషయం పట్టించుకోని ఆటో మొబైల్స్ యజమాని ఈ నెల 10న కొందరు మెకానిక్‌లపై దౌర్జన్యం చేసి గాయ పరచాడు. ఈ సంఘటనపై మెకానిక్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా శ్రీ ముత్తుమారెమ్మ ఉత్సవాలు ప్రారంభం

కుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త

స్థానిక రామచంద్రారోడ్‌లో నెలకొన్న శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా మొదలయ్యాయి. ఉదయం గణపతిపూజ, స్వస్తివాచకం, కలశస్థాపన, మహాలక్ష్మిగణపతి, దుర్గా లక్ష్మి, శాంతిహోమాలు జరిపారు.అలాగే పంచామృతాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి విశేషంగా అలంకరించి ప్రత్యేకపూజలు, మహామంగళ హారతి కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, ఆలయ కమిటీ ఛైర్మన్ హర్షధర్మతేజ, న్యాయవాది అమరనాథ్, తిలక్, బలరాంమూర్తి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సిఎం చంద్రబాబు చొరవ

– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త

నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు చొరవ చూపుతున్నారని ప్రభుత్వ విప్,కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పైచెక్కునత్తం గ్రామంలో నూతనంగా సిసి రోడ్డుకు పూజలు చేసి ప్రారంభించారు. అలాగే గ్రామంలో నూతన అంగన్‌వాడీభవనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా పాలనలో పల్లెలు అభివృద్ధికి ఆమడ దూర ంలో నిలిచిపోయాయన్నారు. ఐదేళ్ల కాలంలో గు ంతలు పూడ్చేనాథుడు కూడా కరువయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కళ్యాణ్‌లు చొరవ చూపి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టారన్నారు. గ్రామాలకు రోడ్లు, డ్రైనేజీలు, రైతులకు గోకులం షెడ్లు, ఉపాధిహామీ పనులు తదితరాలు వేగవంతం చేశారన్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సాంబశివ ం, కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, కడ సభ్యులు రామచంద్ర,వెంకటేష్, తెలుగుయువత రాష్ట్ర నేత చెక్కునత్తం మణి, నేతలుశ్రీనివాసులు, కనకరాజు, మునిరత్నం, మహేంద్ర,సంతోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌చే శ్రీకృష్ణాష్టమి కరపత్రాల ఆవిష్కరణ

కుప్పంరూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త

ఇందూజ్ఞానవేదిక ఉత్సవ కమిటీ అధ్వర్యంలో నిర్వహించే శ్రీకృష్ణాష్టమి వేడుకల కరప త్రాలను సోమవారం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఆవిష్కరించారు. కుప్పం ప్యాలస్ దగ్గర ఈనెల 16నుంచి 21వతేది వరకు శ్రీకృష్ణాష్ట మి వేడుకలు నిర్వహించనున్నారు. 21వతేది స్వామివారి విగ్రహాన్ని ఊరేగించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఉత్స వాలకు ప్రభుత్వ విప్ డా॥ కంచర్లను ఆహ్వానించారు. కార్యక్రమాల్లో కమిటీ అధ్యక్షులు కృష్ణ, సభ్యులు ప్రకాష్, కృష్ణారెడ్డి, శరవణ, రాజ్‌కుమార్, కృష్ణమూర్తి, ఇందిర, వెంకటలక్ష్మి, పూజ, మైత్రి పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలకు కంప్యూటర్లు.. ప్రింటర్ల పంపిణీ

శాంతిపురం, ఆగస్టు 11 ప్రభాతవార్త

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వి.కోట అమ్మాక్స్ సంస్థ అధినేత డా॥ దశరథరెడ్డి 21 కంప్యూటర్లు, 3 ప్రి ంటర్లు, యాభై స్టూడెంట్ డ్యూయల్ డెస్క్‌లను తనవంతుసాయంగా అందించారు. వీటితో ప్రభుత్వ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుచేయాలని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెందేందుకు తమవంతు కృషి చేస్తున్నామని డా॥ దశరథరెడ్డి పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ జయకుమార్,

సప్తకన్నికలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

– మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసన

చిత్తూరురూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త: చిత్తూరుపట్టణం, దొడ్డిపల్లి సప్తకన్నికలమ్మ ఆలయం ఎదుట రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుకు వైసిపి ఏపి రాష్ట్ర మొదలియార్ విభాగం అధ్యక్షులు జ్ఞానజగదీష్ సోమవారం కొబ్బరికాయలు కొడుతూ నిరసన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిత్తూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త విజయానందరెడ్డి మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో భాగంగా తెలుగుదేశం ప్రభుత్వం ఎంపి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసారని, ఆయనకు త్వరగా బెయిల్ మంజూరు కావాలని దేవాలయాల ఎదుట కొబ్బరికాయలు కొడుతూ అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, టౌన్ అధ్యక్షుడు కెపి శ్రీధర్, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైయస్సార్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా అయ్యప్పన్

పాలసముద్రం, ఆగస్టు 11 ప్రభాతవార్త :

పాలసముద్రం మండలం పాలసముద్రం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గా అయ్యప్ప న్ గత నాలుగు సంవత్సరాల ఆరు నెలలుగా పంచాయతీ ప్రజలకు చేసిన సేవను గుర్తించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సి సెల్ ప్రెసిడెంట్ గా నియమించింది ఈ సందర్భంగా అయ్యప్పన్ మాట్లాడుతూ నాకు ఇంత పెద్ద బాధ్యతను అప్పజెప్పిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డికి జిల్లా పార్టీ ప్రెసిడెంట్ భూమన కరుణాకర్ రెడ్డికి మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఇంచార్జ్ కృపా లక్ష్మికి పాలసముద్రం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తులసి రామ్ యాదవ్ కి కృతజ్ఞత తెలియజేశాడు.

వైభవంగా శ్రీ రాఘవేంద్ర స్వామి జయంతి ఉత్సవాలు

పుంగనూరు రూరల్ ఆగస్టు 11 ప్రభాతవార్త

పట్టణంలోని బ్రాహ్మణ వీధి శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం శ్రీ రాఘవేంద్ర స్వామి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం పుణ్యాహవచనంతో పూజలు ప్రారంభించి, పవిత్ర జలాలు పంచగవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం పుష్పాలు, పట్టు వస్త్రాలు, రత్నా భరణాలతో శోభాయామానంగా స్వామివారి అలంకరించారు. ఆలయం భజనలతో, హరినామ స్మరణతో మార్మోగింది. ప్రత్యేక అష్టోత్తర శతనామ పూజలు, మంత్రోచ్చారణల మధ్య భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం మంగళవాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తిని రథం పై ఊరేగింపుగా పట్టణ వీధుల్లో ప్రదక్షిణ చేయించారు. భక్తులు స్వామివారికి హారతులు సమర్పించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు

వైద్య సదుపాయం సద్వినియోగం చేసుకోండి

పుంగనూరు రూరల్, ఆగస్టు 11, ప్రభాతవార

ప్రభుత్వం అందజేస్తున్న వైద్య సదుపాయాలను గ్రామస్తులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పవన్ కుమార్ అన్నారు. సుగాలిమిట్ట విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సోమవారం ఫ్యామిలీ ఆయన ఆధ్వర్యంలో జరిగింది. వైద్య సిబ్బంది గర్భవతులను బాలింతలను పరీక్షించి సూచనలు చేశారు. రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోమన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు టీకాలు సరైన సమయంలో వేయాలన్నారు. బి పి. చక్కెర వ్యాధిగ్రస్థులను పరీక్షించి మందులు పంపిణీ చేసారు. క్రమం తప్పక పరీక్షించుకొని మందులు వాడాలని తెలిపారు.కొత్త కోడళ్ళు ఎన్టీఆర్ వైద్య సేవ కార్డులలో చిరునామా మార్చుకోవాలని తెలిపారు. మంగళవారం అన్ని పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో జాతీయనులిపురుగుల నివారణ దినోత్సవంజరుగుతుందనితెలిపారు. వైద్య సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.

2340 మంది పిల్లలకు నులి పురుగుల మందులు లక్ష్యం

పుంగనూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త

పట్టణ గ్రామీణ ప్రాంతాల పరిధిలో 2340 నంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించేందుకు లక్ష్యంగా కార్యచరణ సిద్ధం చేశావని వైద్య విస్తరణ అధికారి మురళి తెలిపారు. 12వ తేదీ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా ప్రతి అంగన్వాడి ప్రతిబడి కేంద్రంగా 100 విద్యార్థులకు మాత్రలు సేవించే కార్యక్రమాలు చేపడతామన్నారు. కోసం ఇప్పటికే ఆయా కేంద్రాలకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు సిద్ధం చేశామని ఆయా అంగన్వాడీ కేంద్రాలు పాఠశాలలో పనిచేసే సిబ్బందిని అప్రమత్తం చేశామని వివరించారు. ఈ మాత్రల వలన ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ ఉండదని కానీ జాగ్రత్తలు పాటించాలన్నారు. మధ్యాహ్నం భోజనం తిన్న తరువాత రెండేళ్ల లోపు పిల్లలకు అర్ధ మాత్ర, నలిపి నీళ్లలో మింగ్రించాలని, మూడేళ్ల లోపుపిల్లలకు ఒక మాత్ర నీళ్లలో వేసి ఇవ్వాలన్నారు. ఈ మాత్రలు జబ్బు పడ్డవారికి, ఏదయినా దీర్ఘ కాలం జబ్బులు కలవారికి ఇవ్వ రాదని, ఎవరికీ బలవంతంగా మ్రింగించారదని, పిల్లలుకు ఇంటికి ఇవ్వరాదని తెలిపారు.

నేడు కాణిపాకంలో సంకటహర గణపతివ్రతం

కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో మంగళవారం సంకటహర గణపతివ్రతంను నిర్వహిం చనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ప్రతినెలా పౌర్ణమి అనంతరం వచ్చే చతుర్థి రోజున ఈవ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు జరిగే ఈవ్రతంలో భక్తులు 350 రూపాయలు టిక్కెట్ చెల్లించి గోత్రనామాలతో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.అలాగే రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు స్వామివారికి స్వర్ణరథోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు.

శాంతిపురం ప్రీమియంలీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

శాంతిపురం, ఆగస్టు 11 ప్రభాతవార్త

స్థానిక టేలర్ కాన్వెంట్ క్రీడా ప్రాంగణంలో సోమవారం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ సభ్యుడు డా॥ బిఆర్ సురేష్‌బాబు శాంతిపురం ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు తెదేపా ఎప్పుడూ ముందు ంటుందన్నారు. టోర్నీ ఏర్పాటుచేసిన స్థానిక నేతలను అభినందించారు. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కుప్పంలో 22 కోట్లతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణంకు చర్యలు చేపట్టామన్నారు.యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు,మాజీఅధ్యక్షుడుజనార్దనరెడ్డి,మాజీవైస్ఎంపిపిఉదయ్‌కుమార్,పిఎసిఎస్ ఛైర్మన్‌గోపాల్, నేతలురమేష్, బాలు,రాజు,మురుగన్,శంకర్,ఉమాపతి,శ్యామలమ్మ,సుగుణమ్మ,అనసూయ పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 45 సమస్యలు

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ వారం ప్రజల నుండి 45 సమస్యలు అందాయి. జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఆపరేషన్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జీ అడ్మిన్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, డిటిసి డిఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారులకు విన్నవించుకున్నారు. ప్రజల నుండి అందిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అడ్మిన్ ఎఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా భూతగాదాలకు సంబంధించి 16, కుటుంబ తగాదాలు 9, ఆర్థిక లావాదేవిలు 8, ఇంటి తగాదాలు 6, దారి సమస్యలు 2, వేధింపులు 3, చీటింగ్‌పై ఒక ఫిర్యాదు అందింది.

నులిపురుగుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి : ఎంపిడివో

వెదురుకుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త :

నులిపురుగుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడివో ఎల్.పురుషోత్తం వైద్యులకు, ఆరోగ్య సిబ్బందికి, ఉపాధ్యాయులకు, అంగన్‌వాడి కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురష్కరించుకుని సోమవారం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి కృష్ణ చైతన్యతో కలిసి గొడపత్రిక, కరపత్రాలు విష్కరించారు. ఆయన మాట్లాడుతూ నులిపురుగులు ఉండటం వలన పిల్లల ఎదుగుదలకు అవరోధమన్నారు. వ్యాధి నిరోదక శక్తిని పెంచి పిల్లల ఆరోగ్యాలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి దామోదరం, కమ్యూనీటి హెల్త్ ఆఫీసర్ మధుసూధన్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శకుంతలచ ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్‌లు మోహన్‌మురళి, ఈశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీలు హిమసాగరి, రజని, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ జెండా తిరంగా ర్యాలీలో బిజెపి నాయకులు

వెదురుకుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త :

జాతీయ జెండా తిరంగా ర్యాలీలో పాల్గొడానికి మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు బోడి రెడ్డి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో పచ్చికాపల్లం నుంచి చిత్తూరుకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాల పై జాతీయ జెండా తిరంగా ర్యాలీ నిర్వహించ తలపెట్టడం జరిగిందన్నారు. దేశ భవిష్య త్‌కు చక్కటి దిశనిర్దేశం చేయడంతో పాటు తన వినూత ఆలోచన విధానాలతో ప్రపంచ దేశాలలో భారత్ బలమైన ఆర్థిక శక్తిగా మార్చడంలో ఆయన నిర్ణయాలు, సేవలు కొనియాడదగ్గవని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రభాకర్‌రాజు, శేఖర్ రెడ్డి, పలువు మహిళ నాయ కురాళ్ళు పాల్గొన్నారు.

పెరియమరుదు, చిన్నమరుదు పాండియార్ విగ్రహాల ఆవిష్కరణ

చిత్తూరురూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త:

చిత్తూరునగరం, గంగినేని చెరువు పక్కన ఆకర్షణీయంగా ఏర్పాటుచేసిన ప్రముఖస్వాతంత్ర్య సమరయోధులు, మొదలియార్ల ఆరాధ్యదైవులైన పెరియమరుదు, చిన్నమరుదు పాండియార్ సోదరుల విగ్రహాల ఆవిష్కరణ ఈనెల 13వ తేది బుధవారం ఉదయం 10గంటలకు ప్రముఖుల చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు మొదలియార్ సంక్షేమ సంఘ అధ్యక్షులు బుల్లెట్ సురేష్ తెలిపారు. సోమవారం కయనికట్టు వీధిలోని మొదలియార్ల సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతదేశపు తొలి స్వాతంత్ర్య పోరాటవీరులు, శివగంగై రాజ్యానికి చెందిన మహారాజులు మరుదు పాండ్యులని కొనియాడారు. మరుదుపాండ్యులు సాంప్రదాయ, మత వ్యత్యాసం లేకుండా మంచి పాలన అందించారనీ, హిందూ ప్రజలకోసం అనేక దేవాలయాలు, క్రైస్తవుల కోసం చర్చిలు, ముస్లింల ప్రజలకోసం మసీదులు నిర్మించడంతో పాటు అనేక దేవాలయాల పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టారన్నారు. అంతటి మహనీయులు విగ్రహాల ఆవిష్కరణ తన చేతుల మీదుగా జరగడం తన అదృష్టంగా భావిస్తున్నాననీ, ముఖ్యఅతిథులుగా చిత్తూరుఎంపి దగ్గుమళ్లప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లతో పాటు తమిళనాడు నుంచి ప్రముఖులు హాజరుకానున్నరని పేర్కొన్నారు. సమావేశంలో బుల్లెట్‌సురేష్ తనయుడు యువనాయకుడు బుల్లెట్ అప్పు, మాజీ మున్సిపల్ చైర్మెన్ భాస్కర్, కార్పొరేటర్లు అలీ, రాయల్‌కుట్టీ, మురళీక్రిష్ణ, గణేష్ మేస్త్రీ, శ్రీకాంత్‌లతో పాటు సంఘ నాయకులు సుందరం, తూగుండ్రం శేఖర్, తమిళనాడుకు చెందిన బాలమురుగన్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ సహాధ్యక్షుడిగా పన్నీర్‌సెల్వం

చిత్తూరురూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త:

గుంటూరులోని ఏపి ఎన్జీవో భవనం నందు జరిగిన ప్రభుత్వవాహన డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ సహాధ్యక్షుడిగా చిత్తూరుజిల్లా ప్రభుత్వవాహన డ్రైవర్లసంఘం మాజీ అధ్యక్షుడు పన్నీర్‌సెల్వంను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ తన సేవలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గం తనను సహాధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, సంఘ నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా అధ్యక్షులు నాగేశ్వరరావు, అనంతపురం, నంద్యాల, కాకినాడ, అమలాపురం జిల్లాల అధ్యక్షులు, భారీ ఎత్తున డ్రైవర్ సోదరులు పాల్గొన్నారు.

సత్వరం సమస్యలకు పరిష్కారం

– మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశం

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త: ప్రజల నుండి సమ స్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు మున్సిపల్ కమీషనర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రజల నుండి అందిన సమస్యలను పరిశీలించిన కమీషనర్ సత్వరం క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రజలకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఇ వెంకటరామిరెడ్డి, ఎసిపి నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల పట్ల అప్రమత్తం

– వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:

మత్తు పదర్థాలు జీవితాలను బుగ్గిపాలు చేస్తోందని, కేరీర్‌లో చేసే ఒక్క తప్పు భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని చిత్తూరు వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ అన్నారు. చిత్తూరు ఆపోలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా వికలాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ, పాస్ స్వచ్ఛంధ సంస్థ సహకారంతో మద్యపానం, మత్తు పదార్థాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల పట్ల అప్రమత్తంగా వుండాలని, గంజాయి, డ్రగ్స్ వంటి పదార్థాలు వాడకం నైతిక, శారీరక పతనానికి దారి తీస్తోందన్నారు. పాస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా డి-అడిక్షన్ సెంటర్ ప్రాజెక్టు మేనేజర్ డి.ప్రతిమ మాట్లాడుతూ మత్తు వ్యసనాల నుండి బయటపడేందుకు సమాజం, కుటుంబం, విద్యాసంస్థలు చేయాలల్సిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-అర్డినేటర్ డాక్టర్ హేమాద్రిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ గాయత్రి, వాలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వేటకు బయలు దేరిన నీలకంఠుడు

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త

శ్రీకాళహ స్తీశ్వరాల యానికి అనుబంధంగా నిర్వహిస్తున్న మండలంలోని ఊరందూరులో వెలసిన నీలకంఠేశ్వరుని ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలల్లో భాంగాగా సోమవారం పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరై స్వామి అమ్మవార్ల పల్లకిని మోసారు.ఆదివారం రాత్రి స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.ఆ ముస్తాబుతోనే సోమ

తిరుపతి డివిజన్

తిరుపతిలో పెరుగుతున్న ఇన్‌స్టామార్ట్ విక్రయాలు

తిరుపతి విద్య, ఆగస్టు 11 ప్రభాతవార్త:

తిరుపతిలో ఇన్‌స్టామార్ట్ విక్రయాలు రోజురోజుకి పెరుగుతున్నాయని ఇన్‌స్టామార్ట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్, హరి కుమార్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మార్గదర్శక క్విక్ కామర్స్ ప్లాట్‌ఫారమ్ ఇన్‌స్టామార్ట్ ను 2024 సెప్టెంబర్ లో తిరుపతిలో ప్రారంభించామన్నారు. రోజువారీ నిత్యావసరాలు పాల ఉత్పత్తుల నుండి బొమ్మలు, ఎలక్ట్రానిక్స్ వరకు వస్తువులను ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో కేవలం 10 నిమిషాల్లోనే డెలివరీ చేస్తూ వినియోగదారులను మన్నలను పొందిందన్నారు. తిరుపతి నడిబొడ్డున గత ఆరు నెలలుగా విక్రయాలలో అగ్రస్థానంలో నిలుస్తోందని, పాల ఉత్పత్తులు, ఫుల్ క్రీమ్ మిల్క్, పెరుగు, టోన్డ్ మిల్క్ జాబితాలో అగ్రస్థానంలో, దాని తర్వాత టమోటా, ఉల్లిపాయ, పచ్చి దోసకాయ వంటి కూరగాయలు విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు.ప్రధాన స్థానిక వేడుకల సమయంలో, నివాసితులు మతపరమైన ఆచారాలకు కేంద్రమైన తాజా పండ్లు, కూరగాయలు, వంట సామాగ్రి, పూజా సామాగ్రి కోసం ఇన్‌స్టామార్ట్ వైపు మొగ్గు చూపుతారని తెలిపారు. వర్షాకాల నెలలు శుభ్రపరిచే సామాగ్రి, గృహ వంటగది ఉత్పత్తులు, స్నాక్స్, టీ, కాఫీ వంటి వేడి పానీయాల అందుబాటులో ఉన్నాయని, వినియోగదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పనపాకం పంచాయతీ సమగ్రాభివృద్ధికి కట్టుబడి వుంటా..!

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంఎల్ఏ పులివర్తి నాని

చంద్రగిరి, ఆగస్టు 11 ప్రభాతవార్త: 2024 సార్వత్రిక ఎన్నికలలో భారీ మెజారిటీ అందించిన పనపాకం పంచాయతీ సమగ్రాభివృద్ధికి కట్టుబడి వుంటానని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. పనపాకంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేధిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అనేక హామీలను విజయవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మహిళలకు ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నట్లు తెలిపారు. రైతు భరోసా పథకంలో ఎవరికైన నగదు జమకానట్లయితే అధికారులను సంప్రదించాలన్నారు. ఈ క్రమంలో గ్రామస్థులను పలకరించిన ఎంఎల్ఏ సమస్యలపై ఆరా తీశారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇంటి పట్టాలు, భూ సమస్యలు, పోలీస్ ఔట్ పోస్టు, పనపాకం నుండి అనుప్పల్లి వరకు రోడ్డు, పశువుల ఆసుపత్రి వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్ఏను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంఎల్ఏ పంచాయతీ అభివృద్ధికి కట్టుబడివున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపిడిఓ వెంకటరత్నం, తుడా డైరెక్టర్ ఏజి పల్లి బాల, మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్ రెడ్డి, టిడిపి పంచాయతీ అధ్యక్షుడు రమేష్, రైతు నాయకుడు కన్నయ్య నాయుడు, మేడసాని కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయండి..!

సిపిఐ మండల కార్యదర్శి ఎన్.శ్రీరాములు

చంద్రగిరి, ఆగస్టు 11 ప్రభాతవార్త:

ప్రమాదకర స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం రద్దు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఎన్.శ్రీరాములు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు .. సోమవారం స్థానిక విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏడిఓ శేషాద్రి రెడ్డికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ప్రతి పక్షంలో వున్నప్పుడు వ్యతిరేకించి అధికారం చేపట్టిన వెంటనే మాటమార్చుతూ కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు అంగీకరించడమేంటని నిలదీశారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికలకు ముందు చెప్పిన కూటమి ప్రభుత్వం 5 ఏళ్ళ క్రితం నాటి విద్యుత్ వినియోగానికి ఇప్పుడు ట్రూ అప్ సర్దుబాటు చార్జీల పేరిట ప్రజలను వంచించడం కాదా అంటూ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం చెప్పిన మాటలకు తలాడిస్తూ పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయకుంటే భవిష్యత్తు పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవై రాజా, మునిరత్నం నాయుడు, వాణి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు చట్టాలపై అవగాహన వుండాలి..!

ఎస్వీయు న్యాయ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ మల్లేశ్వరి

చంద్రగిరి, ఆగస్టు 11 ప్రభాతవార్త:

గ్రామీణ ప్రజలకు చట్టాలపై అవగాహన కలిగి వుండాలని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం న్యాయ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. మండల పరిధిలోని చిన్నరామాపురంలో సోమవారం ఎస్వీయు 5 సంవత్సరాల న్యాయవిభాగం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కులు, అక్రమ కేసులు నమోదుపై చట్టాలను వివరించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టపరమైన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జ్యోతి, డాక్టర్ సుధాకర్, విద్యార్థులు వెంకటేష్, విజయ్‌కుమార్, కుసుమ, స్వరాజ్, రాఘవేంద్ర, దివాకర్, జునైన్, తదితరులు పాల్గొన్నారు.

బాలపల్లిలో ఉచిత మెగా పశు వైద్య శిబిరం

రేణిగుంట ఆగస్టు 11 ప్రభాతవార్త

రేణిగుంట మండలం మామండూరు పంచాయితీ కుక్కల దొడ్డి (బాలపల్లి) గ్రామం జ్యోతి నగర్ కాలనీలో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైతులకు సంబంధించిన పశువులు జీవాలకు రాస్ వెటర్నరీ వైద్య బృందం ఉచిత మెగా పశు వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. శిబిరానికి పలువురు రైతులు తమ పశువులను తీసుకొచ్చారు. వైద్యులు పశువులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేసి మందులను ఉచితంగా అందజేశారు. కొన్ని పశువులకు ఇంజక్షన్లు వేయడమే కాకుండా కడుపులో పెరుగుతున్న పురుగులు నశించడానికి పురుగులు మందు తాగించారు. పిడుదుల నివారణ కోసం పి డుదల నివారణ మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది శంకరయ్య, గిరి ప్రసాద్, ఇందుమతి, నాగమణి రైతులు పాల్గొన్నారు...

చెన్నై తిరిగినా తగ్గని కడుపు నొప్పి

– చిన్న ఆపరేషన్‌తో రోగి ప్రాణం కాపాడిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, డాక్టర్ల బృందం

తిరుపతి హెల్త్, ఆగష్టు 11 ప్రభాతవార్త



ః నాలుగు సంవత్సరాలుగా చెన్నై లాంటి మహానగంలో తిరిగినా తగ్గని కడుపునొప్పిని ఓ చిన్న ఆపరేషన్ ద్వారా రోగిని బ్రతికించిన సంఘటన సోమవారం రష్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. పరిమల అనే మహిళ వయస్సు 41 సంవత్సరాలు. ఆమెకు గత 4 సంవత్సరాలుగా కడుపు నొప్పి ఉండేది. చెన్నై లాంటి పెద్ద పెద్ద ఆస్పత్రులకు వెళ్ళినా డబ్బులు ఖర్చే తప్పా కడుపు నొప్పి తగ్గలేదు. ఈ తరుణంలో తిరుపతిలోని రష్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను సంప్రదించగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తన డాక్టర్ల బృందంతో అన్ని పరీక్షలు నిర్వహించిన ఓ చిన్న ఆపరేషన్ ద్వారా పిత్తాశంలోని రాళ్ళను తొలగించి మహిళా రోగి ప్రాణాలను కాపాడారు. దీంతో రోగి, రోగి బంధు వులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, డాక్టర్ల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ల బృందంలో డాక్టర్ సిపాయిసుబ్రమణ్యంతోపాటుడాక్టర్‌చంద్రకుమార్,డాక్టర్ పవన్‌కుమార్,డాక్టర్ తేజ ,సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ సెక్రటరీ పోస్టుకు ధరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి విద్య, ఆగస్టు 11 ప్రభాత వార్త జిల్లాలో రెండు ఏళ్ల కాలవ్యవధితో స్కూల్ గేమ్స్ సెక్రటరీ పోస్టు నియామకం కొరకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్),పీఈటీల నుంచి ధరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కనీసం 10ఏళ్ల సర్వీసు కలిగి అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 20వ తేదీలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

డీ ఫార్మసీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి విద్య ఆగస్టు 11 ప్రభాత వార్త: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను డీఫార్మసీ రెండేళ్ల కాలవ్యవధిగల కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై ద్వారకనాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ రెగ్యులర్ లేదా ఓపెన్లో ఉత్తీర్ణులై విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులని తెలియజేశారు.విద్యార్థులు హెచ్‌టిట పిఎస్//ఎపిఎస్‌బిటిఇటి.ఇన్/పిహెచ్‌ఎఆర్‌ఎమ్‌ఎసివై(ఫార్మసి) అను వెబ్సైట్ ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రతిని తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఫార్మసీ విభాగం నందు ఈనెల 19వ తేదీ లోపు అందజేయాలని తెలిపారు.ఈ 9908857585, 996676 1446, 9963541557, 9550690007,9059698747 నంబర్లకు వాట్సప్ ద్వారా పంపవచ్చని తెలియజేశారు.

అథ్లెటిక్స్ పోటిలో ఫాతిమా ప్రతిభ

శ్రీకాళహస్తి రూరల్ (ఏర్పేడు) ఆగష్టు 11 ప్రభాతవార్త

ఏర్పేడుకు చెందిన ఫాతిమా ఆంధ్రప్రదేశ్‌స్టేట్ లెవెల్ తిరుపతి జిల్లా తరుపున బాపట్ల జిల్లా చీరాల మండలంలో జరిగిన జూనియర్ అథ్లెటిక్స్ పోటీలో ఈ నెల 10,11,12 న జరిగినడిస్కస్ త్రో లో ప్రథమ బహుమతి సాధించింది.ఆమె తిరుపతి లో ఎస్వీఆర్ట్‌కళాశాలలో బి.ఏ ప్రథమ సంవత్సరం చదువుతుంది.అదే విధంగా షాట్‌పపుట్‌లో ద్వితీయ బహుమతిని సాధించిందని ఈ మేరకు సెప్టెంబర్‌లో నెలలో గోవాలో జరుగుతున్న జాతీయస్థాయి పోటీలకు మన రాష్ట్రం తరుపున ఫాతిమా పాల్గొంటుందని ఆమెకు ఒలంపిక్ అసోషియేషన్ జనరల్ కార్యదర్శి రోబోట్,పిడి శివకుమార్‌లు అభినందించారు.

ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీ ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలు

పుత్తూరు రూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల బ్రహ్మోత్సవాలు ధ్వజావరోహణంతో ముగిసింది. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, అలంకరణలు, అర్చనలు చేశారు. అలాగే అగ్నిగుండ శాంతి పూజ ఉత్సవం, సాయంత్రం అమ్మవారి వసంతోత్సవం కార్యక్రమం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవం ముగిసింది.

ఆదాని స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

– సీపీఎం, సీపీఐ ధర్నా

పుత్తూరు రూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త:

ఆదాని స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం పుత్తూరులో విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలకు నిలువు దోపిడీని ఆపాలని ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యాశాఖ మంత్రులు కేసు బాబు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హార్ట్ మీటర్లు పగులగొట్టాలని చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లు పెట్టండని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ బాటలోనే కూటమిప్రభుత్వం కూడా నడుస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం స్మార్ట్ మీటర్లు రద్దు చేసి ప్రజల పైన భారాలు వేయకూడదని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, సీపీఐ నాయకులు రమణయ్య, విజయ్, సుబ్రహ్మణ్యం, హమాలి, వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

పుత్తూరు రూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త:

పుత్తూరు ద్రౌపదీదేవి తిరుణాళ్ళ నేపథ్యంలో విధులు ముగించుకుని ఆదివారం రాత్రి తన స్వగ్రామం కార్వేటినగరం వెళ్లే క్రమంలో కణంమిట్ట సమీపంలో కానిస్టేబుల్ అయ్యప్ప ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అయితే ఈ రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప తల పైన బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం మధ్యాహ్నం అయ్యప్ప మృతదేహానికి నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదపు ఘటన వివరాలపై త్వరితగతిన దర్యాప్తు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

కొనసాగుతున్న నిరసనలు

పుత్తూరు రూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త:

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత నాలుగు రోజులుగా డిగ్రీ అధ్యాపకులు నిరసన చేస్తున్న విషయం తెలిసిందే. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు నల్ల బ్యాడ్జిలు ధరించి సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపే కార్యక్రమం చేపట్టారు. మన రాష్ట్రంలో అన్ని విభాగాల్లో బదిలీలు జరిగినా, డిగ్రీ కళాశాలలో ఇంత వరకు బదిలీలు చేపట్టకపోవడం శోచనీయమని అధ్యాపకులు అన్నారు. బదిలీలతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పేరు మార్పు, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ఇంకా ప్రవేశాలు జరపకపోవడం వంటి న్యాయమైన కోరికలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జీసీజీటీఏ జిల్లా అధ్యక్షుడు టి.నరసింహులు, జీసీటీఏ జిల్లా కార్యదర్శి సి.వెంకటకృష్ణయ్య, రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.సుజనా, కళాశాల ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు జీవ ఇంధనం ఎంతో కీలకం

పుత్తూరు రూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త:

జీవ ఇంధనాల వినియోగం పర్యావరణ పరిరక్షణకు ఎంతో ముఖ్యమని కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్ర మౌలిఅన్నారు. ఆదివారం ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరులో ప్రపంచ జీవ ఇంధన దినాన్ని కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌలి మాట్లాడుతూ జీవ ఇంధనాన్ని వాడడం వల్ల బొగ్గు, పెట్రోల్, డీజిల్ మొదలైన రసాయనాల వాడకం తగ్గుతుందని, అలాగే గాలి కాలుష్యం కూడా తగ్గడంతో పర్యావరణం పరిశుభ్రమవుతుందని అన్నారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగ అధ్యక్షుడు డాక్టర్ పి.హరిబాబు, డాక్టర్ ఎం.శంకరరావు, డాక్టర్ ఎం.విష్ణుప్రియ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీ హాస్పటల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వీరస్వామి.

రేణిగుంట ఆగస్టు 11 ప్రభాతవార్త

రేణిగుంట విమానాశ్రయం కి వెళ్లి మార్గంలో పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ గా సోమవారం ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వీరస్వామి ఎమ్మెస్,ఎంసిహెచ్ నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఆయన తిరుపతి రుయా ఆసుపత్రి, కర్నూలు మెడికల్ కళాశాలలో సూపరింటెండెంట్ గా పనిచేశారు. వైద్య వృత్తి పట్ల ఎంతో అనుభవం ఉన్న ఆయనను తమ కళాశాల ఆసుపత్రికి సూపరిండెండెంట్ ఉద్యోగ బాధ్యతలు అప్పగించామని కళాశాల చైర్మన్ డాక్టర్ పాణిగ్రాహి అన్నారు. డాక్టర్ వీరస్వామిని చైర్మన్ పాణిగ్రాహి, కళాశాల డీన్ డాక్టర్ శివనాథన్, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ నాగరాజు, జేఈవో డాక్టర్ నవీన్ కుమార్, ఎన్టీఆర్ వైద్య సేవ ఇంచార్జ్ డాక్టర్ నరసింహ, ఏవో చైతన్య తదితరులు ఘనంగా సత్కరించి ఆయనకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ పాణిగ్రాహి మాట్లాడుతూ ఆసుపత్రిలో ఇప్పటివరకు ఎన్నో సౌకర్యాలు కల్పించామన్నారు. కంటి నుండి పంటి వరకు వైద్యం చేయగల అనుభవం కలిగిన వైద్యులు ఉన్నారన్నారు. 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈసీజీ, 2డిఎకో, ఎక్సరే, సిటీ, ఎంఆర్ఐ స్కాన్ లు ఆస్పత్రినందు అందుబాటులో ఉన్నాయన్నారు. రేణిగుంట మండలంలో విధులు నిర్వహిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుకు త్వరలో మెడికల్ డిజిటల్ కార్డులు మంజూరు చేసి వారికి ఉచిత వైద్య సేవలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అన్ని విభాగాల వైద్య నిపుణులు సిబ్బంది పాల్గొన్నారు.

అదాని స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా....

.రేణిగుంట ఆగస్టు 13 ప్రభాతవార్త

ప్రభుత్వం బలవంతంగా విద్యుత్ వినియోగదారులకు అంటగడుతున్న అదాని స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ నేతలు రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సోమవారం రేణిగుంట ఏపీఎస్పీడీసీఎల్ బిల్లులు సేకరించే కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రేణిగుంట సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి కొండ్రెడ్డి ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఎవరైనా కాంట్రాక్టర్ వర్కర్లు ఇంటికి వచ్చి స్మార్ట్ మీటర్లు బిగించే పనికి ఉపక్రమిస్తే వెంటనే 100 నెంబర్ కు కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసే హక్కు వినియోగదారుడికి ఉందన్నారు. కార్పొరేటర్ల లాభం కోసం స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు అంటగడుతున్నారని వాపోయారు. బిల్లులో వస్తున్న ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రూరల్ కార్యదర్శి సెల్వ రాజు, ఎంపీటీసీ రాజేశ్వరి, తారక రామా నగర్ సిపిఎం కార్యదర్శి సత్య శ్రీ, రాజశేఖర్, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు శివానందం, దిలీప్ భాష, దీప, భారతి, సులోచన, దస్తగిరి, ప్రశాంత్, కోటి, మహాలక్ష్మమ్మ, సిద్ధమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

– పోలీసులకు బాధితురాలు మునిరాజమ్మ విజ్ఞప్తి



తిరుపతి హెల్త్, ఆగష్టు 11 ప్రభాతవార్త ః

అమెరికాలో ఉన్న తమ పిల్లలు సౌకర్యార్థం ఇల్లు నిర్మాణంకై రంగంపేటలో తమ సొంత ఆస్తి అమ్మి తిరుచానూరు సమీపంలోని మామిడికాయల మండి వద్ద రూ.లక్షలు వెచ్చించి తాను కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేసి ఇబ్బందికి గురి చేస్తున్నారని రంగంపేటకు చెందిన ప్రస్తుతం తిరుపతిలో కాపురం ఉంటున్న బాధితురాలు మునిరాజమ్మ వాపోయారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు మునిరాజమ్మ మాట్లాడారు. తమ బిడ్డలు పంపిన డబ్బుతో సర్వే నెంబరు 250/2సి1లో 30 సెంట్లు భూమిని రాజారాం వారి సోదరిని వద్ద 2017లో భూమిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అయితే టీడీపీ నేతలు జేబీ శ్రీనివాసులు, గణపతినాయుడు, భాస్కర్‌రెడ్డి తమను అడ్డం పెట్టుకుని ఈ స్థలం మాదంటూ దౌర్జన్యం చేస్తున్నారని బాధపడ్డారు. ఈ విషయం పోలీసులకు, ఎమ్మెల్యే నానికి వివరించడం జరిగిందన్నారు. నాని స్పందించి టీడీపీ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి భార్య బాధితురాలు మునిరాజమ్మ అని, వెంటనే ఆమెకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగిందన్నారు. అయితే ఇప్పటి వరకు న్యాయం జరగలేదని, సీఎం, ఎమ్మెల్యే నాని, కలెక్టర్ స్పందించి తమ భూమిని ఆక్రమించిన ఆక్రమ దారులపై తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేతన్నలను ఆదుకుంటున్న చంద్రన్నను ఆదరించండి

: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం, ఆగస్టు 11 ప్రభాతవార్త :

చేనేత, మరమగ్గ కార్మికుల సంక్షేమం పని చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలకేంద్రంలోని కయనికట్టువీధిలో సోమవారం జాతీయ చేనేత కార్మిక దినోత్సవంలో భాగంగా మధ్యాహ్నం 2గంటలకు థ్యాంకు సిఎం సార్ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నారాయణవనం సొసైటీకి 98లక్షలు మంజూ రైందన్నారు. అలాగే పాలమంగళంలోను క్లస్టర్ ఏర్పాటు చేసి అక్కడి నేతన్నలను ఆదుకోవడానికి కృషి చేస్తున్నట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళీ శాఖ ఎడిఓ రమేష్, జౌళీశాఖ సూపర్‌వైజర్ కిరణ్‌కుమారి, మాజీ నెడ్‌క్యాఫ్ ఛైర్మన్ ఆర్‌డి ఏకాంబరం, గుత్తి త్యాగరాజు, మాజీ ఎంపిపిలు ఎపి భక్తవ త్సలం, పి గోవిందస్వామి, మాజీ డిసిసిబి డైరెక్టర్ ఊరప్ప, ఎంపిడిఓ అరుణ, సర్పంచ్ కెజి శార దమ్మ తనయులు రామ, లక్ష్మణన్, మాజీ సర్పంచ్ కెఎస్‌ర విరెడ్డి, పంచాయతీ ఇఓ టిపి షణ్ముగం, విద్యు త్‌శాఖ ఎఇ జయప్రకాష్, నాయకులు బిఎం నరేష్, రామ లింగంమొదలి, మోహన్, దిల్లీ, సొరకాయులు, కుమార్ మొదలి, సోడా మణిరెడ్డి, మొహీద్దీన్, నాగరాజు, గోవిందశెట్టి,ఏలుమలైఎంజిఆర్, దేవరాజులు, ముత్తు, బాలయ్య, చేనేత కార్మికులు అందరు పాల్గొన్నారు.

ముగిసిన ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, ఆగస్టు 11 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి పట్టాభిషేకం నిర్వహించిన తర్వాత ధ్వజ అవరోహణంతో ముగించారు. ఈనెల 1వతేది నుంచి బ్రహ్మోత్సవాలను ఆలయ ధర్మకర్త దేశప్పరెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి ఆటంకాలు, అడ్డుంకులు ఎదురుకాకుండా నిర్వహించడంపై కమిటీ సభ్యులు అభినందించారు. ఆదివారం జరిగిన అగ్నిగుండ ప్రవేశంలో మునుపెన్నడు లేని విధంగా ఈ ఏడాది సుమారు 100మంది భక్తులు కంకణం ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసినట్టు తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా మారిన పశువైద్యశాల..!

నారాయణవనం, ఆగస్టు 11 ప్రభాతవార్త :

నారాయణవనం మేజర్ పంచాయతీ కార్యాలయం మందుబాలకు, గంజాయి వినియోగదారులకు అడ్డగా మారింది. పశువైద్యశాల జనసంచారం లేని అరుణా నదిని ఆనుకొని వున్నది. ఇకపోతే శాఖ గ్రంథాలయం కూడా దీని పక్కనే వున్నది. దీంతో పశు వైద్య అధికారులు, సిబ్బంది ఉన్నంత వరకు ఇటు వైపు ఎవ్వరు రారు. పశు వైద్యాధికారులు డ్యూటీ ముగించుకొని వెళ్లిన తర్వాత ఒక్కొక్కరుగా మందుబాబులు చేరుకొని రాత్రి 11గంటల వరకు మందు సేవిస్తుంటారు. ఉదయం మందుబాబులు అక్కడే పడుకోవడం, మందు బాటిళ్లు, మాంసం ముక్కలు దర్శనమిస్తున్నాయి. ప్రతి రోజు వీటిని శుభ్రం చేయడం సిబ్బందికి కష్టంగా మరింది

గూడూరు డివిజన్

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గూడూరు. ఆగస్టు 11 ప్రభాతవార్త : పట్టణంలోని పాతబస్టాండు ప్రాంతంలో ఉన్న విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగిన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత లయన్ బయ్యా రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ గూడూరు క్లబ్ సీనియర్ క్లబ్ అని క్లబ్‌పై ఉన్న అభిమానంతో ఎన్ని కార్యక్రమాలు ఉన్నా సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చానని తెలిపారు. తన చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ కుర్చీలు,పేపర్ బాయ్‌కు సైకిల్ ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. క్లబ్ అధ్యక్షుడిగా అక్కన రమణయ్య, కార్యదర్శిగా ఆర్ రవిచంద్ర, కోశాధికారిగా వీరేంద్రనాథ్ మిగతా సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డీఎస్ కుమార్,లయన్ ఎస్.ఎస్.వి రామ్మోహన్ రావు, క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్,ఆర్.వి రావు,మురళీ రెడ్డి,వాకాటి రామ్మోహన్ రావు,సోమిశెట్టి చెంచురామయ్య, సీనయ్య, రూపేష్ రెడ్డి,మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం : ఎంపిడిఓ

గూడూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త: నులి పురుగులను సమూలంగా నిర్మూలించి జిల్లాలో ఎక్కడా కూడా వాటి జాడ లేకుండా నులిపేద్దాం అని గూడూరు ఎంపిడిఓ మధుసూదన్ రావు పేర్కొన్నారు. మంగళవారం నేషనల్ డీ వార్మింగ్ డే సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ మధుసూదన్ రావు చేతుల మీదుగా గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు మండలం వ్యాప్తంగా ఈ వ్యాధి నివారణకు సంబంధించిన మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏం.ఈ.ఓ రవీంద్ర బాబు, సి.డి.పి.వో మెహబూబి, చెన్నూరు పి.హెచ్.సి డాక్టర్ జ్యోతి, సిబ్బంది మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సొసైటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

కోట, ఆగస్టు 11 ప్రభాతవార్త : మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, తిన్నెలపూడి సొసైటీ ఛైర్మన్‌గా పలగాటి భాస్కర్‌రెడ్డి సోమవారం కోటలోని సొసైటీ కార్యాలయంలో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తిన్నెలపూడి సొసైటీ పరిధిలో రైతులకు అర్హత ఉన్న వారికి విరివిగా రుణాలు అందజేస్తామని తెలిపారు. ఇది రైతు ప్రభుత్వమని, రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, చిరంజీవితో పాటు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, కొత్తపాలెం జలసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, జితేంద్రరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు మర్రి పోలయ్య, సిఇఓ శ్రీనివాసులురెడ్డి, కోట సిఇఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్‌చే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

గూడూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త: టీటీడీకి చెందిన తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం చిల్లకూరు మండలంలోని చింతవరం, వల్లిపేడు పిహెచ్ సిలలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. ఆగస్టు 14న వరగళి, బాలిరెడ్డిపాళెంలో పింక్ బస్సుల క్యాంపులు ఆగస్టు 18న జికె.పల్లి, చెన్నూరు, ఆగస్టు 21న బాలాయపల్లి, దక్కిలి, ఆగస్టు 25న చిట్టేడు, చిల్లకూరు, ఆగస్టు 28న దాసుకుప్పం, బంగారుపేట నిర్వహిస్తామన్నారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ టివిడి.ప్రత్యూష, డాక్టర్ ఎం.లలిత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో చింతవరం వైద్యాధికారి డాక్టర్ బి.సుమ, వల్లిపేడు వైద్యాధికారులు డాక్టర్ దినేష్, డాక్టర్ శివశంకర్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్య భాను, స్థానిక నాయకులు పి.వెంకటేశ్వర్లు, కె.సాయిబాబా, వి.ప్రకాష్, జె.గోపాల్, ఎంపిహెచ్ఈవో ఎన్.హజరతయ్య, పిహెచ్ ఎన్ జె.శాంతి, సూపర్వైజర్ భువనేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

భూముల్ని బలహీన పేదలందరికీ పంచాలి : సిపియం

గూడూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త: వెంకటగిరి మండలం "కలపాడు" గ్రామ దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల పేద ప్రజలందరికీ కుటుంబానికి రెండు ఎకరంలో చొప్పున పంచాలని కోరుతూ సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సుమారు 110 మంది భూమిలేని నిరుపేదలు ధర్నా నిర్వహించారు. సి.పి.యం పార్టీ వెంకటగిరి ఏరియా కన్వీనర్ వడ్డీపల్లి చెంగయ్య మాట్లాడుతూ వెంకటగిరి మండలం కలపాడు గ్రామ పరిధి సర్వే నెంబర్ 1లో 1441 30 ఎ సెంట్లు ప్రభుత్వ భూములు ఉన్నాయని రెవెన్యూ రికార్డుల ప్రకారం మేత పరంబోకుగాను అడవి పరంబోకుగాను ఉన్నాయన్నారు. కలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో భూమిలేని దళితులు, గిరిజనులు, ఇతర వెనకబడిన సామాజిక తరగతుల వారు 300 కుటుంబాలు వారు నివాసాలు ఉంటున్నారని. కూలి పని తప్ప వారి అందరికీ వేరే జీవనాధారం లేదన్నారు. అర్జీలు పెట్టుకుంటూనే ఉన్నాము కానీ ఇంతవరకు న్యాయం జరగలేదు. పేదలకు ప్రభుత్వ భూములను దక్కకుండా కబ్జా చేస్తున్నటువంటి శంకరయ్య, వారి అనుచరుల పైన వారికి సహకరిస్తున్న వీఆర్వో పైన చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ వెంకటగిరి ఏరియా కన్వీనర్ వడ్డీపల్లి చెంగయ్య గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, ఏం బేటి చంద్రయ్య, చెంచు కృష్ణయ్య చెంచు రామయ్య, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉద్యోగం మీ వెంటే

- ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి

కోట, ఆగస్టు 11 ప్రభాతవార్త: ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం నుంచి నాలుగేళ్ల పాటు ప్రణాళికాబద్ధంగా చదివితే అటువంటి విద్యార్థులు బిటెక్ కోర్సు పూర్తయ్యే లోపు ప్రముఖ బహుళజాతి కంపెనీలలో ఉద్యోగాలు సాధిస్తారని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో మొదటి సంవత్సరం బిటెక్‌లో చేరిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రధానంగా సమయాన్ని వృధా చేయకుండా ఒక ప్రణాళిక ప్రకారం చదువుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగేళ్లు కష్టపడితే జీవితాంతం సుఖంగా జీవించవచ్చని పేర్కొన్నారు. తరగతి గది, క్రీడా ప్రాంగణం లేదంటే గ్రంథాలయానికి వెళ్లాలే తప్ప ఎక్కడా కూడా సమయాన్ని వృధా చేయకూడదన్నారు. ఎన్‌బికెఆర్‌లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని చెప్పారు. 45 సంవత్సరాల నుంచి తమ కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు దేశంలో ప్రముఖ స్థానాల్లో ఉన్నారని తెలిపారు. కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కళాశాలను ప్రగతి పథంలో నడిపిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాది పతులు పాల్గొన్నారు. అంతకుముందు తల్లిదండ్రులు, విద్యార్థులు ల్యాబ్‌లను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు రావడంతో కళాశాలలో పండుగ వాతావరణం నెలకొంది.

ఎలక్ట్రానిక్ షాప్ దగ్ధం

గూడూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త: పట్టణంలోని ఆసుపత్రి రోడ్డులో ఉన్న కుషల్ ఎలక్ట్రానిక్స్ షాప్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. అగ్నిమాపక అధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని ఆసుపత్రి రోడ్డులో ఎస్.వి. తిలక్‌కి చెందిన కుషల్ ఎలక్ట్రానిక్స్ షాప్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో కేఫ్ దగ్ధమైందన్నారు. సుమారు ఐదు లక్షల మేరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

గూడూరులో పాలన అస్తవ్యస్తం : ఎమ్మెల్సీ

వాకాడు, ఆగస్టు 11 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుండి పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, అందులోని భాగంగా గూడూరులో టిడిపి అండతో రౌడీ రాజ్యం పెరిగిపోయిందని శాసనమండలి సభ్యులు మేరీగా మురళీధర్ అన్నారు. సోమవారం వాకాడు ఎంపీపీ కార్యాలయంలోని మండల వైసీపీ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వైకాపా యువ నాయకుడు, క్రియాశీలక సభ్యులు కొత్తూరు గ్రామానికి చెందిన శరత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయము తెలిసిందే, ఆయన కుటుంబ సభ్యులను పరా మర్శించడుకు వచ్చానని అన్నారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ పరిణామాలు ఎలా మారిపోయాయని ఎద్దేవ చేశారు. గూడూరులో పాలన అదుపుతప్పి రౌడీయిజం ఏలుతున్నారని, గంజాయి విచ్చలవిడిగా అక్రమంగా జరుగుతుంద న్నారు. అధికార ఎమ్మెల్యేకే సుంకాలు చెల్లిస్తూ ఉంటే అధికారులు కూడా ఏం చేస్తారని అన్నారు. ఆయన వెంట వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కొడవలూరు దామోదర్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరు సర్పంచ్ దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి, సర్పంచ్ సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ దువ్వూరు మధుసూదన్ రెడ్డి, నాయకులు వాకాటి రవికుమార్ తదితరులు ఉన్నారు.

మండల పరిషత్‌లో ఆర్గానిక్ కూరగాయలు

వాకాడు, ఆగస్టు 11 ప్రభాతవార్త: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ వారి సౌజన్యంతో నిడుగుర్తి సచివాలయానికి సంబంధిం చిన రైతులు ఎటువంటి రసాయనాలు పురుగుమందులు ఉపయోగించకుండా పెంచినటువంటి కూరగాయలను ప్రతి సోమవారం కార్యాలయ భవన ఆవరణంలో ప్రజలకి అందుబాటులో ఉంచుతామని తెలియజేశారు. మారుతున్న టువంటి ఆధునిక కాలంలో మన ఆరోగ్యాన్ని ఎంతో జాగ్రత్తతో శ్రద్ధతో కాపాడుకోవాలని అందుకు రసాయనాలు మరియు ప్లాస్టిక్ రహిత ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు మండల అగ్రికల్చర్ ఆఫీసర్ దీప, ఆర్గానిక్ సిబ్బంది గంగా వేణు, సమీరా తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన ఉయ్యాల

నాయుడుపేట, ఆగస్టు 11 ప్రభాతవార్త : రాష్ట్ర పౌరసరపరాల శాఖమంత్రి నాదేండ్ల మనోహర్‌కు సోమవారం రేణిగుంట విమానాశ్రయం వద్ద సూళ్ళూరుపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇంచార్జి ఉయ్యాల ప్రవీణ్ ఘనస్వాగం పలికారు.ా ంల్వేకోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటి చెర్మేన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్‌ను రేణిగుంట ఎయిర్‌పోర్టు వద్ద ఉయ్యాల ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మనోహర్‌కు ఉయ్యాల ప్రవీణ్ పుష్పగుచ్చం అందజేసి ఘనస్వాగతం పలికారు.

అనుమతి లేని పౌల్ట్రీ నిర్మాణం ఆపండి

పెళ్లకూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త : మండలంలోని చిల్లకూరు గ్రామ పంచాయితీ మన్నే ముత్తూరు చెరువు నందు అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న కోళ్ల ఫారంను వెంటనే నిలిపివేయాలని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం నాడు తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఎమ్మార్వో హరికృష్ణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామానికి అతిసమీపంలో ఈ పౌల్ట్రీ నిర్మించడం చాలా దురదృష్టం అన్నారు. ఈ నిర్మాణం కొరకు చెరువులో గ్రావిల్ రోడ్డు నిర్మించుకొని 50 లక్షలు రూపాయలు విలువ చేసే మట్టిని అక్రమంగా తరలించారు, రెవెన్యూ, ఇరిగేషన్, మొదలైన సంబంధిత శాఖల నుండి ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు. సర్వే నంబర్ 34-2 ,34-4 ఒక 1 ఎకరా70 సెంట్లు చెరువు భూమిని ఆక్రమించుకొని ఆ కట్టడంలో విలీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణముఖి ఆనకట్ట మాజీ చైర్మన్ పేరం రమేష్ నాయుడు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు వేలూరు మురళీకృష్ణారెడ్డి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి,శిరసనం భేటీ చైతన్య కృష్ణారెడ్డి,దువ్వూరురాకేష్‌రెడ్డి,నర్రావుల లోకేష్ పాల్గొన్నారు.

సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభాభిషేకాలు

కోట, ఆగస్టు 11 ప్రభాతవార్త : గూడలిలోని శ్రీకామాక్షి సమేత శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయంలో మహా కుంభాభిషేకాల్లో భాగంగా రెండోరోజు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నూతన విగ్రహాలను, పాత విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామంలోని భక్తులు విగ్రహాలకు అభిషేకాలు చేశారు. బాణాసంచా వేడుకల మధ్య గ్రామోత్సవం వైభవంగా కొనసాగింది. ఆలయ ప్రధాన అర్చకులు కార్తిక్ శర్మ, అర్చకులు గణపతి హోమాన్ని నిర్వహించారు. పలువురు కంకణాలు కట్టుకుని హోమాలు చేశారు.

లబో దిబో అంటున్న రైతు

వాకాడు, ఆగస్టు 11 ప్రభాతవార్త: వాకాడులో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చేతికొచ్చిన వరి పంట పడిపోవడంతో రైతు లబోదిబోమంటు బాధ వ్యక్తం చేశారు. వాకాడులోని పది పదిహేను రోజు లోపల చేతికి వచ్చే వరి పంటను అకాల వర్షం కురవడంతో వరి పైరు కింద పడిపోవడంతో నష్టపోయా మని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికే అప్పులు తెచ్చి పెట్టామని వర్షం రాకతో నష్టపోయామని అన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

మహాసభను విజయవంతం చేయాలి

ఓజిలి, ఆగస్టు 11 ప్రభాతవార్త: రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం తిరుపతిలో జరిగే సారథ్యం మహాసభకు ఓజిలి మండలం నుండి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి సారథ్యం మహాసభను విజయవంతం చేయాలని ఓజిలి మండలం బిజెపి అధ్యక్షులు బిల్లు పవన్ కుమార్ యాదవ్ సోమవారం నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

మాధవ్‌కు పుంగనూరు సుగాలి మహిళలు స్వాగతం

పుంగనూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కు చిత్తూరులో సోమవారం సుగాల మిట్ట లంబాడి మహిళలు సంప్రదాయ నృత్యంతో స్వాగతం పలికారు. పార్టీ అధ్యక్షుడు మాధవ్ జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా సమావేశంలో పుంగనూరు నుంచి వందలాదిగా వచ్చిన లంబాడీ కళాకారుల నృత్య స్వాగత కార్యక్రమం పలువురును ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు జి ఆర్ విజయ శంకర్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించండి : జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి,ఆగస్టు 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో భూ సమస్యలు తారాస్థాయికి చేరుకున్నాయి. గతంలో పరిపాలించిన వైకాపా పాలనలో ప్రభుత్వ భూములకు రెక్కలు రావటమే కాకుండా రైతుల భూములు పేర్లు మారిపోయాయి. కొందరి ఇళ్ళకు సంబంధించి రికార్డులే లేదు. టిడ్కోఇళ్ళను తీసుకున్న వారికి మభ్యపెట్టి జగనన్న కాలనీలో ఇస్తామంటూ టోపి వేసిన సంఘటనలు సోమవారం నాటి ప్రజా వేదికలో బహిర్గత మయ్యాయి. రాత్రి 9గంటల వరకు కూడా బాధితులు తమ బాధలను విన్నవిస్తూనే ఉన్నారు.వర్షం కురుస్తున్నా తమ బాధలను విన్నవించుటకు నిరీక్షించారు. శ్రీకాళహస్తి పంచాయితీ రాజ్ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజామస్యల పరిష్కరానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్,శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రజాసమస్యల పరిష్కరవేదికలో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కరవేదికకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని వచ్చిన అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎంఎల్ఎ బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడు తూ పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కరవేదికను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆగష్టు 5న కోరారు. అందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఈ నెల 11న శ్రీకాళహస్తిలో ప్రజాసమస్యల పరిష్కరాన్ని ఏర్పాటు చేసి హాజరవుతారన్నారు. మాట ప్రకారం ప్రజాసమస్యల వేదికను ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రజావేదికల్లో అర్జీలు స్వీకరిస్తూ ప్రజాసమస్యలు వింటూ అప్పటికప్పుడే పరిష్కరం చూపూతు పరిష్కరం కానీ వాటిని నిర్దేశించిన గడువులోగా పరిష్కరం చూపేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల వద్ద నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని అన్‌లైన్లో నమోదు చే సి వాటిపై తానే ప్రత్యేకంగా పరిశిలించి ప్రతి నెల ప్రజాసమస్యల పరిష్కరవేదికను ఏర్పాటు చేయడం జరుగతుందన్నారు.అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి వాటిని అన్‌లైన్లో నమోదు చేసిఅర్జీదారులకు రసీదు అందించారు.

80 శాతం భూ సమస్యలే :

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సుమారు 1500 అర్జీలు వచ్చాయని అందులో అత్యధికంగా 80శాతం భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలకు సంబందించినవే అని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కరవేదికలో వచ్చిన అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కారంచేస్తామని తెలిపారు..ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, ఎపిఐఐసిజోనల్ మేనేజర్ భరత్‌రెడ్డి డిఎస్పీ నరసింహామూర్తి, మున్సిపల్ కమీషనర్ భవాని ప్రసాద్ తహశీల్దార్లు, ఎంపిడిఓ డివిజన్ రెవెన్యూ అన్ని శాఖల ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

ఏషియా రబ్బీ ఎమిరేట్స్‌లో పలమనేరు బాలిక ప్రతిభ

పలమనేరు టౌన్, ఆగస్టు 11 ప్రభాతవార్త: ఏషియా రబ్బీ ఎమిరేట్స్ అండర్ 20 చాంపియన్ షిప్ పోటీల్లో చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన అక్షయ ప్రతిభ చూపింది. బీహార్ వేదికగా ఈ నెల 10న జరిగిన పోటీల్లో 9 దేశాలు పాల్గొనగా అక్షయ విశేషమైన ప్రతిభ చూపి కాంస్య పథకం సాధించింది. క్రీడలపట్ల ఈ బాలికకు ఉన్న ఆసక్తి, పట్టుదలకు నిదర్శనమని. భవిష్యత్తులో మరింత అత్యుత్తమంగా రాణించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికిప్రణాళికలు : కలెక్టర్

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ద డానికి పక్కా ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ, జడీ సిఇఓ రవికుమార్, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, డ్వామా పిడి రవికుమార్ తదితర అధికారులతో దూర విద్యవిధానంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని వివిధ వృత్తుల్లో వున్న 15 సంత్సరాలు పైబడిన వయోజనులను దృష్టిలో వుంచుకుని పక్కాగా కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఎస్ఎ ఎపిసి వెంకటరమణ, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరీ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తురాలు మంగళవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు మదనపల్లెకు చెందిన శైలజారెడ్డి అనే భక్తురాలు నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాతలు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

అలుపెరగని నాయకుడు...చెంచన్న మృతి

శ్రీకాళహస్తి,ఆగస్టు 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు తాటిపర్తి చెంచురెడ్డి (93) సోమవారం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గత కొంత కాలంగా శాశ్వకోశవ్యాధి, కిడ్నిల వాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. సీనియర్ న్యాయవాదిగా ప్రజలకు సన్నిహితమైన ఆయన ఎందరికో ఉచిత న్యాయసలహా అందించారు. గెలుపు ఓటములతో పనిలేకుండా ప్రజాసేవలో నిరంతరం తరించాడు. 1970 నుంచి శ్రీకాళహస్తిలో ఓ న్యాయవాదిగా రాణించారు. 1976-77 వరకు జనతా పార్టీలో చేరి 1978లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి కాంగ్రెస్ ఐ అభ్యర్థి ఉన్నం సుబ్రమణ్యంనాయుడు చేతిలోఓడిపోయారు. 1979-80లో శ్రీకాళహస్తికి బిజెపి నాయకుడు అటల్‌బీహారి వాజపేయిని శ్రీకాళహస్తిలో జరిగిన సభకు ఆహ్వానించి బేరి వారి మండపం వద్ద జరిగిన బహిరంగ సభలో కాబోయే ప్రధాని అంటూ ప్రకటించిన ఘనత దక్కించుకున్నారు. 1983లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓట్లలో రెండవ స్థానం సాధించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐ అభ్యర్థి మూడవ స్థానంలో నిలవటం ఆయన ప్రజల గుర్తింపుకు నిదర్శనం. 1985లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి 88 ఓట్ల తేడాతో ఓడిపోయారు. కోర్టుకు వెళ్ళి తెలుగుదేశం అభ్యర్తిని అనర్హుడుగా చేసి ఉప ఎన్నికలు రావటంతో ఆ ఎన్నికల్లో పోటీ చేసి తెలుగుదేశం అభ్యర్థిపై 4400పై చిలుకు ఓట్లతో గెలుపొందారు. ఆయ